తాను'' అన్నాడు సురేష్ తనవైపే చూస్తూ.

''నువ్వు పాలు త్రాగు. నేను టీ త్రాగుతాను''

''నాకు ఫ్రెష్‌గా ఉండే పాలు కావాలి'' అంటూ తన వైపు చూసి నవ్వాడు అతను.

సిగ్గుతో చచ్చిపోవాలనిపించింది తనకు. మనుషులు ఇంత సంస్కార రహితంగా ఉంటారని ఆమెకు తెలియదు. మగవాళ్ళు ఆడపిల్లల్ని కామెంట్ చేయడం, ఏడిపించడమే తనకు తెలుసు. ఓ ఆడపిల్లగా అవి తనకూ ఎదురయ్యాయి. కాని మగవాడికి బిడ్డకు పాలిచ్చే ఆడదానిలో ఓ తల్లే కనబడుతుందని తను భావించింది. కాని ఇలా అసభ్యకరమైన ఆలోచనలు, మాటలు కూడా వస్తాయని తను ఈరోజే తెలిసింది. ఇటువంటి సమయాలలో భర్త ప్రక్కన లేకపోవడం ఎంత లోటో అనిపించింది. ప్రక్కనే తల్లి ఉన్నా భర్త పోయిన బాధలో ఆమె ఉంది. ఒంటరి ఆడదానికి శారీరకంగానే కాదు మానసికంగా కూడా రక్షణలేదు అనుకుంది. ఆ తర్వాత అతను అన్న మాటల్ని తలచుకుని మూడు రోజులు ఏడ్చింది.

''హలో. అంజలిగారూ. ఏమిటి ఆలోచిస్తున్నారు. ఈయన మావారు సురేష్'' అంటూ భర్తను పరిచయం చేసింది శశికళ. ఆమెను చూసిన సురేష్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. తను ఆమెతో వెకిలిగా ప్రవర్తించినా, అసభ్యంగా మాట్లాడినా తన బిడ్డకు పాలిచ్చి ఎంతో ఉపకారం చేసిన ఆమెలో ఓ అమ్మ కనిపించింది అతనికి ఈసారి. రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాడు దీనంగా ఆమె వైపే చూస్తూ. ఆ చూపులో ఎన్నో అర్థాలు కనిపించాయి ఆమెకు. 'చేసిన సహాయానికి ధన్యవాదాలు చెప్పడంతో పాటూ తన తప్పు క్షమించమన్న అభ్యర్థన, తన ప్రవర్తన గురించి తన భార్యకు చెప్పవద్దన్న వేడుకోలు, ఇంకెప్పుడూ ఎవరితోనూ అలా ప్రవర్తించను' అన్న హామీ అతని చూపుల్లో కనిపించి నవ్వుతూ తనూ ప్రతి నమస్కారం చేసింది. ఎంతైనా ఆమె ఆడది. క్షమాగుణం ఆమె ఆస్తి.

**-సి.ఎన్.చంద్రశేఖర్ (చిత్తూరు)**

# అల్పజీవి

అది గోపాలపురం బీచ్‌కు వెళ్ళే సుదీర్ఘమైన రోడ్డు. వరుసగా మేమంతా మొత్తం ఆరుగురం మోటార్ సైకిళ్లతో ఉత్సాహం ఉరకలు వేస్తుండగా బీచ్ చేరుకున్నాం. ముక్కులపైకి జారిపోయిన కళ్ళజోడ్లు, భుజాలకు వేళ్లాడుతున్న కెమెరాలు. మేమంతా రాజుతో కలిసాం. ఇదివరకే ఆ వూరు చేరి మాకోసం ఎదురు చూస్తున్నాడు మిత్రుడు రాజు.

అందరి దగ్గరా కెమెరాలు వున్నా నేను ఫొటోలు తీసే ప్రత్యేకమైన కెమెరాపై ఎక్కువ మక్కువ చూపుతారు మిత్రులు. బహుశా నేను తీసిన కొన్ని ఫొటోలకు బహుమతులు రావడం కారణం కావచ్చు.

మా ఉత్సాహమంతా నీటి పక్షుల్ని ఫొటో తీయడం పైనే వుంది. ముఖ్యంగా బీచ్‌కు కాస్త దూరంగా విజిటర్స్ ఎక్కువగా వెళ్లని ఓ చోట పెద్ద నల్లరాతిపైన నివాసం ఏర్పరచుకుని ఉండేది ఓ గ్రద్ద. మేం ఎప్పుడైనా గోపాలపురం పిక్నిక్‌కి వెళ్లేటప్పుడు దర్శనమిచ్చేది ఆ గ్రద్ద. దానిని ఫొటోలు తీయడం మా పిక్నిక్‌లో ముఖ్యాంశం అయిపోయింది కొన్నాళ్లకి. అయితే దాన్ని ఫొటోలో బంధించాలంటే సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలే అనువైనవి. మిగతా సమయాల్లో ఆ గ్రద్ద నల్లరాతిపైన కనిపించేదికాదు. ఆహారాన్వేషణలో ఎక్కడికి పోయేదో ఏమో మరి! అందుకే అది ఉండే సమయం కోసం నిరీక్షించి మరీ ఫొటోలు తీసేవాళ్లం.

ఆ రోజు కూడా... ఎర్రగా ఉదయిస్తున్నాడు బాలభానుడు సముద్రం నింగీ కలిసే చోట. సముద్రపు హోరులో మామధ్య సంభాషణలు అరుపులే అయిపోయాయి. అందరం గ్రద్ద ఉండే నల్లరాతి దగ్గరకు చేరాం. యధావిధిగా గ్రద్ద కనిపించడంతో నా సంతోషానికి అవధులు లేవు. దూరంగా చిన్న చిన్న నల్లరాతి గుట్టల వెనుక అందరం నక్కి సర్దుకుని కూచున్నాం.



నా కెమెరాని ఓ చిన్న రాతిపైన ఏర్పాటుచేసి ఫొటోలు తీసాను. మరోసారి మరో రాతిపైన వేరే యాంగిల్‌లో ఫొటోలు తీసాను. మిగిలిన స్నేహితులు కూడా ఏవేవో ఫొటోలు తీసారు.

ఇదంతా జరిగి అప్పుడే ఓ దశాబ్దం పైచిలుకు అయింది. ఇప్పుడు ఆనాటి స్నేహితులంతా ఊళ్ళో లేరు. ఉద్యోగ, వివాహాలు మమ్మల్ని సహజంగానే విడదీసాయి. నేను కూడా నా వివాహం అయిన తరువాత ఉద్యోగరీత్యా ఢిల్లీ వెళ్లిపోయాను. ఆ తరువాత ఎప్పుడైనా ఊరికి వచ్చినా గోపాలపురం వెళ్లడం కుదిరేదికాదు.

అయితే పాత జ్ఞాపకాలు బలంగా వెంటాడగా మళ్ళీ వెళ్లాను ఒంటరిగా. ఈసారి కెమెరా కూడా లేదు. అసలు ఫొటోగ్రఫీ హాబీగా కూడా ఇప్పుడు నా జీవితంలో లేదు. నాలో అలనాటి సునిశితమైన కళాతృష్ణ సమసిపోయింది. నేనిప్పుడు బాధ్యతల్లో కూరుకుపోయిన ప్రభుత్వ ఉద్యోగిని.

బీచ్‌కు కుడివైపుగా మనుష్య సంచారానికి దూరంగా ఆ నల్లరాతి దగ్గరకు చేరుకున్నాను.

సూర్యాస్తమయం అప్పుడే జరుగుతోంది. సముద్రం నీలివర్ణం నుండి నలుపు రంగులోకి మారుతోంది. ఏవేవో పాత జ్ఞాపకాలు నా మెదడులో కమ్ముకుంటున్నాయి.

ఇంతలో దూరంగా తన విశాలమైన రెక్కల్ని తాటిస్తూ గ్రద్ద వచ్చి నల్లరాతిపైన వాలింది. అయితే గ్రద్ద కదలికల్లో పూర్వపు చురుకుదనం లేదు. అయినా నా పిచ్చిగానీ పక్షికైనా, మనిషికైనా కాలం కాటువేయక మానదు. ఏ ప్రాణికైనా యవ్వనం సడలి ముసలితనం మీద పడకపోదు. పైగా పక్షి ఓ అల్పజీవి. దాని జీవితకాలం కూడా స్వల్పమేకదా.

నల్లరాతిపైన గ్రద్ద నాకు ఏవేవో జీవిత సత్యాల్ని నూరిపోసినట్లు అనిపించింది.

సూర్యాస్తమయం పూర్తి అయినాక అంతటి సముద్రమూ చీకటిలో మునిగిపోయింది. ఇక నల్లరాతిపైన గ్రద్ద ఏం కనిపిస్తుంది?

నేను బీచ్ నుంచి ఇంటి ముఖం పట్టాను.

**-బి. నిర్మల్‌రావు**
(బరంపురం)